క్లుప్తంగా

రూపం కోల్పోయిన ఏకేఎల్ గెడ్డ



వెంకంపేట వద్ద ఏకేఎల్ గెడ్డ దుస్థితి

రేగిడి: మండలంలోని ఆకులలోవ కట్టగెడ్డ పూర్వరూపాన్ని కోల్పోయింది. ఉణుకూరు నుంచి ఆమదాలవలస వరకు ఈ గెడ్డ విస్తరించి ఉంది. దీని ఆయకట్టు పరిధిలో 25 గ్రామాలకు సంబంధించి 5600 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. ప్రస్తుతం గెడ్డలో పూర్తిగా తుప్పలు పేరుకుపోయి సాగునీరు పొలాలకు అందని పరిస్థితి ఏర్పడింది. వరదలు సంభవించే సమయంలో గెడ్డలో నుంచి వరదనీరు పోకుండా పొలాలను ముంచెత్తుతుంది. అధికారులు స్పందించి కాలువలో మొక్కలు తొలగించే కార్యక్రమం అయినా చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ఉపాధ్యాయుడిని కొనసాగించాలని నిరసన



పాఠశాల ముందు నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

వంగర: మండల పరిధి నీలయ్యవలస ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న చేబోలు జయరాజ్‌ను కొనసాగించాలని గ్రామానికి చెందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. శుక్రవారం పాఠశాల వద్ద నినాదాలు చేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి వినూత్న బోధన చేపట్టడంతో పాటు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించిన జయరాజ్ మాస్టారు బదిలీపై వెళతారన్న సమాచారం వారు తెలుసుకొని వారంతా పాఠశాల ముందు నిరసన తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి జయరాజ్ మాస్టారును కొనసాగించాలని కోరారు.

తల్లికి వందనంలో ఈ కోతలెందుకో..!



మాట్లాడుతున్న ఏపీ విద్యార్థి జేఏసీ కార్యవర్గ సభ్యులు

బొబ్బిలి: తల్లికి వందనం పేరుతో గత ప్రభుత్వం పాఠశాల నిర్వహణకని చెప్పి రూ.2వేలు కోత విధించిందని, మేం అధికారంలోకి వచ్చాక రూ.15వేల మొత్తాన్ని తల్లికి వందనం పేరుతో వారి ఖాతాల్లోకే పూర్తిగా ఇస్తామన్న కూటమి ప్రభుత్వం ఇప్పుడు కోతలెందుకు విధిస్తోందని ఏపీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయికిరణ్ యాదవ్ ప్రశ్నించారు. స్థానిక గ్రోత్ సెంటర్‌లో విలేకర్లతో శుక్రవారం మాట్లాడారు. ప్రకటనకూ చేస్తున్న దానికి పొంతన లేదన్నారు. అంతే కాకుండా దూరంగా ఉన్న విద్యార్థులు విద్యా సంస్థలకు వచ్చి పోయేందుకు ప్రయాణ చార్జీలు కూడా ఇస్తామన్న కూటమి ప్రభుత్వ నాయకులు మాట్లాడటం లేదేమిటని ప్రశ్నించారు. పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ పట్నాయక్, డివిజన్ సెక్రటరీ రాజ్‌కమల్, మహేష్, సతీష్ తదితరులున్నారు.

పారిశుధ్య కార్మికులపై కేసు కొట్టివేతతో హర్షాతిరేకాలు



హర్షం వ్యక్తం చేస్తున్న కార్మికులు

బొబ్బిలి: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 279 జీవోకు వ్యతిరేకంగా పోరాడుతున్న పారిశుధ్య కార్మికులపై పెట్టిన కేసును బొబ్బిలి కోర్టు కొట్టివేసినట్టు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడారు. అప్పట్లో మున్సిపల్ కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు దిగారన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రైవేటు కార్మికులను ప్రభుత్వం పెట్టిందన్నారు. వారిని రెగ్యులర్ కార్మికులు అడ్డుకోవడంతో మున్సిపల్ ఆస్తులను ధ్వంసం చేసినట్టు 20 మంది కార్మికులపై పోలీసులు కేసులు పెట్టారన్నారు. ఈ కేసు ఇన్నాళ్ల వరకూ నడిచిందనీ అయితే ఆధారాలు లేకపోవడంతో శుక్రవారం స్థానిక న్యాయమూర్తి కేసును కొట్టివేసినట్టు చెప్పారు. కార్మికుల పక్షాన సీనియర్ న్యాయవాది చందాన సూర్యనారాయణ కేసును వాదించినట్టు శంకరరావు తెలిపారు. కేసు కొట్టివేయడంతో కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఎప్పటికైనా న్యాయం గెలుస్తుందన్నారు.

జాబ్ మేళాలో 35 మందికి ఉద్యోగావకాశాలు

బొబ్బిలి: పట్టణంలోని విద్వాన్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాలో 35 మంది నిరుద్యోగ యువత ఉద్యోగాలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ రెడ్డి మోహనరావు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఎంఎస్ఎన్ ఫార్మా కంపెనీ ప్రతినిధులు నిర్వహించిన ఈ జాబ్‌మేళాకు 72 మంది నిరుద్యోగులు హాజరవ్వగా అందులో ఎంపికైన 35 మందికి నియామక పత్రాలు అందజేసినట్టు తెలిపారు. హెచ్ఆర్‌లు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీరందేదెలా...!

- నిర్వహణ లేని సాగునీటి కాలువలు
- రెల్లి గడ్డి, గుర్రపు డెక్కలతో నిండిన సాగునీటి వనరులు
- గాలికొదిలేసిన ఇరిగేషన్
- ఖరీఫ్‌లో ఆయకట్టుకు సాగునీరందని దుస్థితి



రాజాం మండలం బొద్దాం వద్ద అధ్వానంగా తోటపల్లి ప్రధాన కాలువ

రాజాం: నియోజకవర్గంలో ఖరీఫ్ పంటల సాగుకు ప్రధాన ఆధారమైన సాగునీటి కాలువల పరిస్థితి దయనీయంగా మారింది. అధిక శాతం పంటలు సాగునీటి కాలువల ఆధారంగానే పండాల్సి ఉంది. ఈ ఏడాది వేసవిలో సాగునీటి కాలువలు నిర్వహణ చేయకపోవడంతో ముంచుకొచ్చిన ఖరీఫ్‌కు సాగునీరు కష్టంగా మారనుంది. గతేడాది కాలంగా సాగునీటి కాలువల ఆధునికీకరణ లేకపోగా, వేసవిలో నిర్వహించే తాత్కాలిక పనులు కూడా ఈ ఏడాది చేపట్టలేదు.

తీరుతెన్నూ లేని తోటపల్లి

నియోజకవర్గంలో రాజాంతో పాటు రేగిడి, వంగర, సంతకవిటి మండలాలకు సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి కాలువ ద్వారా సాగునీరు అందుతోంది. ఖరీఫ్‌లో ఒక్క రాజాం మండలంలో మాత్రమే ఈ కాలువ ద్వారా కొంత ఆయకట్టుకు సాగునీరు అందే పరిస్థితి ఉంది. ఉప కాలువల ద్వారా రేగిడి, సంతకవిటి మండలాలకు అందాల్సిన నీరు ఒక్క చుక్క కూడా రావడం లేదు. రాజాంలో కంచరాం, బొమ్మినాయుడువలస, బొద్దాం, ముద్దాడజోగివలస తదితర ప్రాంతాలను ఆనుకుని ఉన్న ఈ కాలువలో పూడికలు పెరిగిపోయాయి. వీటి తొలగింపునకు గతంలో ఉపాధి పనులు చేయగా ఇప్పుడు వాటిని అలా వదిలేశారు. ఇరిగేషన్ నిర్వహణ పూర్తిగా పక్కన పెట్టేసింది. దీంతో ఖరీఫ్‌లో కాలువ ద్వారా సాగునీరు అందాల్సిన 7200 ఎకరాల ఆయకట్టుకు కష్టం తప్పదన్నట్టుగా ఉంది.

మడ్డువలస ఆయకట్టు వివరాలు..	
మండలం	ఆయకట్టు
వంగర	996.94 ఎకరాలు
రేగిడి	6,700.76 ఎకరాలు
సంతకవిటి	10,976.06 ఎకరాలు
జి.సిగడాం	6,029.03 ఎకరాలు
పొందూరు	99.20 ఎకరాలు
లావేరు, ఎచ్చెర్ల	5200 ఎకరాలు(స్టేజ్–2)

మడ్డువలస నిర్వహణేది..

నియోజకవర్గంలో వంగర మండలంలోని గొర్లె శ్రీరాములనాయుడు మడ్డువలస ప్రాజెక్ట్ ద్వారా వంగర, రేగిడి, సంతకవిటి మండలాల్లో 19 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందాల్సి ఉంది. కాలువలో ఎక్కడికక్కడే ప్రాజెక్ట్ ద్వారా వరదల సమయంలో వచ్చిన గుర్రపు డెక్క చేరింది. ఇది కాలువలతో పాటు పరిసర ప్రాంతాల్లో దిబ్బలుగా ఏర్పడి నీరు ప్రవహించని పరిస్థితి ఉంది. కాలువలో ఆధునికీకరణతో పాటు ఇతర అభివృద్ధి పనులు ప్రభుత్వం చేయకపోవడంతో పాటు ఇరిగేషన్ శాఖ నిర్వహణను పక్కన పడేసింది. ఖరీఫ్‌లో ఈ కాలువ ద్వారా ఢైలాండ్ ప్రాంతాలతో పాటు ఆయకట్టుకు కూడా సాగునీరు అందని పరిస్థితి కనిపిస్తోంది.

నారాయణపురం ఆనకట్ట వైపు కన్నెత్తి కూడా చూడలేదే..

నియోజకవర్గంలో సంతకవిటి మండలంలో విస్తరించి ఉన్న నాగావళి నది నారాయణపురం ఆనకట్ట కుడికాలువ ద్వారా సంతకవిటి, పొందూరు, ఎచ్చెర్ల మండలాల్లో 18,700 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. సంతకవిటి మండలంలో 5,190 ఎకరాల్లో ఆయకట్టు ఉంది. జైకా నిధులతో అక్కడక్కడ పనులు చేసిన అధికారులు వదిలేశారు. ఈ ఏడాది ఉపాధి పనులతో పాటు మెయింటినెన్స్ పనులు కూడా ఇంతవరకూ చేయలేదు. ఈ కాలువ ద్వారా సాగునీరు ఖరీఫ్‌లో ఆయకట్టుతో పాటు పిల్ల కాలువలకు కూడా గగనంగానే కనిపిస్తోంది.



సంతకవిటి మండలం మంతిన–మల్లయ్యపేట సమీపంలో నారాయణపురం కుడి కాలువ దుస్థితి

ఓపెన్‌హెడ్ చానల్స్..

రాజాం నియోజకవర్గంలో రాజాంలో సారధిగెడ్డ, రేగిడిలో ఏకేఎల్ గెడ్డ, రేగిడి, సంతకవిటి మండలాల్లో సాయన్నగెడ్డలు ప్రధాన సాగునీటి కాలువలు కంటే కూడా మంచిగా ఆయకట్టుకు సాగునీరు అందించే కాలువలుగా గతంలో ఖ్యాతి ఉండేది. ప్రస్తుతం ఈ కాలువలు ఆయకట్టుకు కూడా నీరు అందివ్వలేని పరిస్థితి ఉంది. ఓపెన్ హెడ్ చానల్స్‌గా ఉన్న సాయన్న చానల్ పూర్తిగా కలుపుతో నిండిపోయింది. రేగిడి, సంతకవిటి మండలాల్లో వీటి షట్టర్లు పూర్తిగా పాడవ్వడం, మదుములు అంతరించిపోవడంతో ఖరీఫ్‌లో ఆయకట్టుకు పంట విషయం పక్కనపెడితే ముంపు అధికమౌతుంది.

తోటపల్లి నీరు లేదు



రేగిడి మండలంలో తోటపల్లి కాలువ ద్వారా సాగునీరు అందాల్సిన గ్రామాలకు నీరు అందడంలేదు. అధికారులు అందుబాటులో ఉండరు. మండల సమావేశాలకు రారు. మడ్డువలస కాలువ పరిస్థితి అలానే ఉంది. ఎప్పుడు గట్లు కొట్టుకుపోతాయో తెలియని పరిస్థితి ఉంది. ఓపెన్ హెడ్ చానల్స్ పట్టించుకునే నాధుడే లేడు.

– వావిలపల్లి జగన్మోహనరావు, వైస్ ఎంపీపీ, రేగిడి మండలం



రేగిడి మండలం అంబఖండి సమీపంలో మడ్డువలస కాలువ దుస్థితి

ఒక్క మదుము కూడా లేదు



నారాయణపురం కుడి కాలువకు మా గ్రామం వద్ద ఆధునికీకరణ చేశారు. మదుములు విడిచి పెట్టమంటే విడిచిపెట్టలేదు. కాలువ ఎగువ భాగాన గుర్రపుడెక్క చేరిపోయింది. సాగునీరు ఇక్కడకు వచ్చి నిలవలేని పరిస్థితి ఉంది. మదుములు లేక పొలాలకు నీరు రాదు. సాయన్నచానల్ మొత్తం అస్తవ్యస్తంగా ఉండడంతో చిత్తారిపురం, వాల్తేరు, బూరాడపేట, మంతిన, మల్లయ్యపేట, రామారాయపురం, గుజ్జన్నపేట గ్రామాల్లో వేలాది పంటపొలాలు ముంపునకు గురౌతున్నాయి. కాలువలు ద్వారా సరైన సమయంలో నీరు రాని పరిస్థితి ఉంది. – గురుగుబెల్లి స్వామినాయుడు, వాల్తేరు, సంతకవిటి మండలం

దృష్టి సారించాం..

మడ్డువలస ప్రధాన కాలువలతో పాటు పిల్ల కాలువలోలే మెయింటినెన్స్ పనులకు పలుచోట్ల ఏరియాలు వారీగా పరిశీలనలు చేశాం. ఈ ఏడాది వేసవిలో మెయింటినెన్స్ నిధులు రాలేదు. కాలువలో నీటిని విడిచి పెట్టే ముందు ట్రైల్ రన్ వేసి, ఎక్కడా ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

– బి.వెంకట్, ఏఈ, మడ్డువలస కాలువ సబ్‌డివిజన్, రాజాం.

చెప్పుకోలేని బాధ!



వ్యవసాయ కార్యాలయంలో వాడుక నీరు లేక పూర్తిగా పాడైన మరుగుదొడ్డిని స్టోర్ రూం కింద వాడుతున్న అధికారులు



పశు వైద్యశాలలో పూర్తిగా శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్డి

ఇంటింటికీ మరుగుదొడ్డి నిర్మించుకోవాలంటూ అన్ని గ్రామాల్లో అధికారులు పర్యటిస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. మరుగుదొడ్డి నిర్మించుకోకపోతే ప్రభుత్వం నుంచి అందే పథకాల నిలిపివేస్తామని హెచ్చరిస్తుంటారు. అలాంటిది మరుగుదొడ్లు నిర్మించుకోవాలని చెబుతున్న అధికారులు ఉపాధి కార్యాలయం, వ్యవసాయ కార్యాలయం, హౌసింగ్ కారాలయం, పశు వైద్యశాలలు, పలు అంగన్‌వాడీ కేంద్రాలలో మరుగుదొడ్లు లేక మహిళలు అవస్థలు పడుతున్నా పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ కార్యాలయాలకు నిత్యం వందల సంఖ్యలో మహిళలు పలు సమస్యలపై వస్తుంటారు. ఈ నేపథ్యంలో కార్యాలయాల ప్రాంగణాలలో మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళలు పడుతున్న ఇబ్బందులు ఆ దేవుడుకెరుక. పలు కార్యాలయాలలో మరుగుదొడ్డి ఉన్నా వాడుక నీరు లేకపోవడంతో అక్కడ మహిళలు అవస్థలు పడుతున్నారు. విధి నిర్వహణకు కార్యాలయానికి వచ్చే ఉద్యోగులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయ ఆవరణలో కనీస అవసరమైన మరుగుదొడ్డి నిర్మించాలని కోరుతున్నారు.

– రామభద్రపురం

దేశవ్యాప్త సమ్మెకు కార్మికులంతా సిద్ధం కావాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్

తెర్లాం: కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని కోరుతూ జూలై 9న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెకు కార్మికులంతా సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ పిలుపునిచ్చారు. తెర్లాంలోని పాత వెలుగు కార్యాలయం వద్ద సీఐటీయూ మండల అధ్యక్షుడు ఎస్.గోపాల్ అధ్యక్షతన మండల మహాసభను శుక్రవారం నిర్వహించారు. మహాసభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, ప్రధానమంత్రి మోదీ ప్రవేశ పెట్టిన నాలుగు లేబర్ కోడ్స్ దేశంలో అమలు జరిగితే కార్మిక వర్గాన్ని కట్టు బానిసలు అవుతారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 4 లేబర్ కోడ్స్‌ను ఏ రాష్ట్రం అమలు చేయకపోయినా మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం పని గంటలను 8 నుంచి 12 గంటలకు మార్చేందుకు ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో తీర్మానం చేయడం దుర్మార్గమన్నారు. ఇది కార్మికులకు రక్షణ లేకుండా చేయడమేనన్నారు. లేబర్ కోడ్స్ అమలు జరిగితే కార్మికులకు ప్రస్తుతం ఉన్న ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు ఉండవన్నారు. దీనికి నిరసనగా జూలై 9న దేశ వ్యాప్త సమ్మెకు అన్ని కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయని, దేశవ్యాప్త సమ్మెకు ప్రతీ ఒక్కరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ దాని అనుబంధ సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

వృద్ధుల పట్ల బాధ్యతతో మెలగాలి



సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శారదాంబ

రాజాం సిటీ: ప్రతీ ఒక్కరు తమ కుటుంబంలోని వృద్ధుల పట్ల బాధ్యతతో మెలగాలని సీనియర్ సివిల్ జడ్జి కె.శారదాంబ అన్నారు. శుక్రవారం ప్రపంచ వృద్ధుల వేధింపుల అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని మున్సిపాల్టీ పరిధి కొండంపేటలోని అనాథ వృద్ధాశ్రమంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి కాలంలో వృద్ధులు నిర్లక్ష్యానికి, నిరాదరణకు గురౌతున్నారని అన్నారు. కుటుంబ సంక్షేమం, అభివృద్ధికి తమ జీవితాన్ని త్యాగం చేసిన వృద్ధులకు జీవిత చరమాంకంలో సముచిత స్థానం లభించడం లేదని తెలిపారు. వృద్ధులపై దాడులు జరగడం బాధాకరమని అన్నారు. వృద్ధులు పొందాల్సిన న్యాయ సేవలపై వివరించారు. అనంతరం ఆశ్రమంలోని వృద్ధులకు స్టీల్ వాటర్ బాటిళ్లను అందజేశారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి కె.నైమిష, ఆశ్రమ నిర్వాహకులు పి.శ్రీనివాస్, ఎస్.పోలారావు, రెడ్‌క్రాస్ సభ్యులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్ పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖాధికారుల బదిలీ

రాజాం : నియోజకవర్గంలోని ముగ్గురు వ్యవసాయ శాఖ అధికారులకు బదిలీ అయ్యిందని ఆ శాఖ రాజాం ఏడీఏ కె.చంద్రరావు విలేకరులకు శుక్రవారం తెలిపారు. రాజాం మండల వ్యవసాయ శాఖ ఏవో ఎ.రేణుకాసాయికి శ్రీకాకుళం వ్యవసాయ శాఖ కార్యాలయానికి బదిలీ కాగా ఆమె స్థానంలో చీపురుపల్లి నుంచి రఘు అనే కొత్త ఏవో వచ్చి చేరారు. రేగిడి మండలం వ్యవసాయ శాఖ ఏవో జి.మురళీకృష్ణతో పాటు సంతకవిటి వ్యవసాయ శాఖ ఏవో పి.నవీన్‌లకు ఈ బదిలీల్లో శ్రీకాకుళం బదిలీ కాగా, వీరి స్థానంలో కొత్త ఏవోలు ఇక్కడకు ఎవరూ రాలేదని వ్యవసాయ శాఖ వెల్లడించింది.

మాటలకందని మహా విషాదమిది



అహ్మదాబాద్ విమాన ప్రమాద దుర్ఘటనలో అసువులు బాసిన వందలాది మంది ప్రయాణికులు వారి కుటుంబాల్లో నెలకొన్న మహా విషాదాన్ని ఎవరూ భర్తీ చేయలేనిదని రోటరీ క్లబ్ జిల్లా చైర్మన్ జేసీ రాజు అన్నారు. శుక్రవారం ఇక్కడి ప్రభుత్వ ఐటీఐ ఆవరణలో ఆ ప్రమాద మృతులకు కొవ్వొత్తుల వెలుగులతో నివాళులర్పించారు. సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. దేశ చరిత్రలోని ఇది అత్యంత దురదృష్టకర సంఘటనని ఆవేదన చెందారు. రోటరీ క్లబ్ బొబ్బిలి ప్రెసిడెంట్ ఎలెక్ట్ శ్రీహరి, కార్యదర్శి ఎలెక్ట్ శికాంత్, ఐటీఐ టీవోలు సీహెచ్ రాజు, సిహెచ్.ప్రసాద్, కె.త్రినాధరావు, ఐటీఐ విద్యార్థులు పాల్గొన్నారు.

– బొబ్బిలి

బాధ్యతలు చేపట్టిన ఐసీడీఎస్ పీవో

బాడంగి: ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణిగా ఎం.వరహాలమ్మ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె అల్లూరి జిల్లా ముంచంగిపుట్టి పీవో ఉంటూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పీవోగా ఉండే కె.రాజ్యలక్ష్మి బలిజిపేట ప్రాజెక్టుకు బదిలీ అయ్యారు.

ఏవో శిరీషాకు సాలూరు బదిలీ

మండల వ్యవసాయాధికారిణిగా పని చేసిన కె.శిరీషాకు సాలూరు బదిలీ అయ్యింది. ఆమె స్థానంలో కొత్తగా పాడేరు మండలం నుంచి పి.సూర్యప్రకాష్ ఇక్కడకు రానున్నట్టు ఆమె చెప్పారు.

ఈవోపీఆర్‌డీకి మక్కువ బదిలీ

మండలంలో పంచాయతీ విస్తరణాధికారిగా పనిచేసిన ఎస్.సూర్యనారాయణకు మక్కువ బదిలీ అయినట్టు ఇంచార్జ్ ఎంపీడీవో శ్రీలత చెప్పారు. మక్కువ మండల పంచాయతీ విస్తరణాధికారి దేవకుమార్ ఇక్కడకు రానున్నట్టు చెప్పారు.

గ్రీన్ అంబాసిడర్ల ఆందోళన



ఆందోళన చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

బాడంగి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రీన్ అంబాసిడర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఎ.సురేష్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేశారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద నినదించారు. పెండింగ్‌లో ఉన్న తమ జీతాలు చెల్లింపుపై స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో వీరి ఆందోళనను విరమించాలని ఇంచార్జ్ ఎంపీడీవో శ్రీలత కోరారు. సమావేశం జరుగుతున్నందున ఎంపీడీవో వచ్చిన తరువాత సమస్యలపై చర్చించవచ్చని సూచించారు. ఈ క్రమంలో మండల సమావేశంలోకి ప్రవేశించేందుకు ఆందోళనకారులు ప్రయత్నించగా పోలీసులు నిలువరించారు. బకాయి జీతాలు చెల్లించాలని, టెండర్ విధానాన్ని రద్దు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని తదితర డిమాండ్లు నెరవేర్చాలని నినాదాలు చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులకు వినతిపత్రం అందజేశారు.

రోడ్డు పనులు ప్రారంభించేదెన్నడో..!



తెర్లాం–ఆమిటి బీటీ రోడ్డు

తెర్లాం: తెర్లాం – ఆమిటి బీటీ రోడ్డు పనులు ప్రారంభించేదెన్నడోనని పలు గ్రామాల ప్రజలు, ప్రయాణికులు, వాహన చోదకులు ప్రశ్నిస్తున్నారు. తెర్లాం నుంచి ఆమిటి వరకు ఉన్న రోడ్డు పూర్తిగా గోతులమయమై కనీసం ద్విచక్ర వాహనాలు కూడా నడపలేని దుస్థితిలో ఉంది. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ రోడ్డు అధ్వానంగా ఉండడంతో రోడ్డుపై ప్రయాణం చేసేందుకు పలు గ్రామాల ప్రజలు, ప్రయాణికులు, వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. తెర్లాం – ఆమిటి రోడ్డు బాగు చేసేందుకు ప్రభుత్వం ఇటీవల రూ.1.46కోట్లు నిధులు మంజూరు చేసినట్టు సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు ప్రకటించారు. ఇంజనీరింగ్ అధికారులు వచ్చి పరిశీలించారు. నిధులు మంజూరైనట్టు ప్రకటించి నెల రోజులపైనే కావొస్తున్నా ఇంతవరకు పనులు మాత్రం ప్రారంభించలేదు. రోడ్డు పనులు సకాలంలో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.

సాదాసీదాగా మండల సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ గౌరి

బాడంగి: మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ భోగి గౌరి అధ్యక్షతన శుక్రవారం జరిగిన మండల సమావేశం సాదాసీదాగా సాగింది. అజెండా మేరకు శాఖల వారీగా అధికారులు మాట్లాడారు. వ్యవసాయ శాఖపై ఏవో శిరిష మాట్లాడుతూ విత్తనాలు, ఎరువులు, పచ్చిరొట్ట విత్తనాలు ఆర్‌బీఎస్‌లలో సిద్ధంగా ఉంచామన్నారు. రైతులు తీసుకోవచ్చన్నారు. కౌలు రైతులు సీసీ కార్డులు కచ్చితంగా పొందాలని సూచించారు. రెవెన్యూ శాఖపై చర్చ సమయంలో వైస్ ఎంపీపీ భాస్కరరావు మాట్లాడుతూ రెవెన్యూ ఎటువంటి సమస్యలు పరిష్కారం కావడం లేదని, మ్యుటేషన్లు పెండింగ్‌లో పెట్టేస్తున్నారని, కేవలం సర్టిఫికెట్లు మాత్రమే చేస్తున్నారన్నారు. ఉపాధిపై ఏపీవో మాట్లాడారు. ఏప్రిల్ నెలాఖరు వరకు ఉపాధి హామీ బిల్లులు జనరేట్ అయ్యాయని మే నెలమాత్రమే పెండింగ్ ఉంటాయన్నారు. ఆరోగ్య శాఖ పద్దుపై డాక్టర్ ఆదిత్య మాట్లాడుతూ జాతీయ స్థాయిలో రెండు వ్యాధుల నివారణకు సర్వేలు, చికిత్సలు జరుగుతున్నాయని అన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, వైస్ ఎంపీపీ బి.రమేష్, ఎస్.భాస్కరరావు, ఇంచార్జ్ ఎంపీడీవో శ్రీలత, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా....

మత్తుజోలికి వెళ్లొద్దు

రాజాం : యువత మత్తు జోలికి వెళ్లొద్దని, చెడు వ్యసనాలకు బానిస కావొద్దని రాజాం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ ఆర్.జైభీమ్ యువతకు సూచించారు. పట్టణంలో చైతన్య జూనియర్ కళాశాల వద్ద విద్యార్థులతో పాటు రాజాం పట్టణానికి చెందిన యువతకు అవగాహన కల్పించారు. ఎస్ఐ జి.మాన్యాలు, సిబ్బంది, కళాశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

మరువాడలో పారిశుధ్య పనులు

వంగర: మరువాడలో పారిశుధ్య పనులు చేపట్టారు. సర్పంచ్ గాడి కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి రెడ్డి నాగరాజు ఆధ్వర్యంలో పలు వీధుల్లోని కాలువల్లో పూడికలు తొలగింపు చర్యలు చేపట్టారు.

సమయపాలన పాటించాలి

రాజాం : ప్రభుత్వ పాఠశాలల్లో సమయపాలన పాటించాలని ఎంఈవో యాగాటి దుర్గారావు ఉపాధ్యాయులకు సూచించారు. వీఆర్అగ్రహారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా శుక్రవారం తనిఖీ చేశారు. హెచ్ఎం నారాయణమ్మ, తల్లిదండ్రులు పాల్గొన్నా రు.

సేవాభావంతో మెలగాలి

వంగర: చిన్నతనం నుంచి సేవాభావం కలిగి ఉండాలని బాలవికాస్ గురువులు బెవర సత్యవతి అన్నారు. శుక్రవారం మండల పరిధి కొప్పరవలస సత్యసాయి మందిరంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. చిన్నారులకు నైతిక విలువలు, క్రమశిక్షణ అలవరుచుకోవాలన్నారు. సాయిభక్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

వంగర: మండల పరిధి అరసాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఎంఈవో–2 ఖండాపు జగదీశ్వరరి శుక్రవారం పంపిణీ చేశారు. మండలంలోని 46 పాఠశాలల్లో 1 నుంచి 10 తరగతులకు చెందిన 3688 మంది విద్యార్థులకు 20151 పుస్తకాలు అందించినట్లు ఆమె తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగా జీవన విధానం కావాలి

రామభద్రపురం: ప్రతి క్షణం ఒత్తిడితో ఉన్న నేటి మనిషికి ప్రశాతం జీవనం అలవరుచుకోవటానికి యోగాను జీవన విధానంగా చేసుకోవాలని నాయుడువలస ప్రాథమికోన్నత పాఠశాల ఆంగ్ల భాషా బోధకులు, కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జేసీ రాజు అన్నారు. పాఠశాలలో హెచ్ఎం వేణు ఆధ్వర్యంలో శుక్రవారం ఆయనతో పాటు యోగా ట్రైనీ శ్యామల కలిసి విద్యార్థులకు యోగాభ్యసన శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాతో మానసిక ప్రశాంతత ఉంటుందన్నారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా పాఠశాలలకు రావాలి

రేగిడి: విద్యార్థులు క్రమం తప్పకుండా ప్రతి రోజు పాఠశాలలకు రావాలని ఎంఈవో ఎంవీ ప్రసాదరావు, బి.ఎరకయ్య విద్యార్థులకు సూచించారు. మండలంలోని దేవుదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలు ఉన్నాయని, విద్యార్థులు చక్కగా చదువుకునేందుకు అవసరమైన వసతులు ఉన్నాయని అన్నారు. హెచ్ఎం ఎస్.సీతారామునాయుడుతో కలిసి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు.

వడ్రంగి కార్మికుడికి గాయాలు

రేగిడి: మండల కేంద్రం రేగిడి గ్రామానికి చెందిన అరసవెల్లి దుర్గారావు అనే వడ్రంగి కార్మికునికి తీవ్ర గాయాలయ్యాయి. వృత్తి పనిలో భాగంగా ఇంటి వద్ద కర్రపని చేస్తుండగా మిషన్ రంపం బ్లేడు అదుపు తప్పి ఎడమ కాలుకి తగిలి తీవ్ర గాయాలయ్యాయి. తోటి సహచరులు వెంటనే స్పందించి విద్యుత్‌ను నిలుపుదల చేసి 108కు సమాచారం అందించారు. రేగిడి 108 సిబ్బంది ఈఎంటీ మీసాల ఈశ్వరరావు, పైలెట్ పి.పవన్‌కుమార్‌లు క్షతగాత్రునికి ప్రథమ చికిత్స అందించి పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

సామూహిక అక్షరాభ్యాసాలు

రేగిడి: ఉంగరాడ, వండానపేట, ఉప్పర్నాయుడువలస, వన్నలి, చాటాయివలస తదితర ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న విద్యార్థులు ఒకటో తరగతిలో చేరేందుకు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లారు. హెచ్ఎంలు, ఉపాధ్యాయులు అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం నిర్వహించారు.

యోగా సాధకుల నివాళి

రాజాం సిటీ: విమాన ప్రమాదంలో మృతి చెందిన వారికి యోగా సాధకులు నివాళులు అర్పించారు. శుక్రవారం స్థానిక దేవి శ్రీదేవి కల్యాణ మండపం వద్ద అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని నివాళులు అర్పించారు.

మున్సిపల్ సిబ్బందితో సమీక్ష

బొబ్బిలి: మున్సిపల్ సిబ్బందితో చైర్మన్ రాంబార్కి శరత్, కమిషనర్ ఎల్.రామలక్ష్మి సమీక్ష నిర్వహించారు. ఇంటి పన్నుల విషయమై డబ్లింగ్ ఎందుకు జరుగుతోందని చైర్మన్ సిబ్బందిని ప్రశ్నించారు. ఒకే తరహా ఇళ్లకు పన్నుల విషయంలో ఎందుకు వ్యత్యాసాలు వస్తున్నాయన్నారు. సచివాలయాల సిబ్బంది ఉదయం 8 గంటలకు కార్యాలయంలో హాజరులో ఉండాలన్నారు. రెవెన్యూ సిబ్బందిపై ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు.

మళ్లీ భవిత సేవలు

బొబ్బిలి రూరల్: వేసవి సెలవుల అనంతరం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న భవిత కేంద్రంలో తిరిగి సేవలు పునరుద్ధరించినట్టు కేంద్ర ఉపాధ్యాయులు పువ్వల కృష్ణ, మోహనరావు తెలిపారు. ఇక నుంచి ప్రతి శుక్రవారం ఇక్కడ విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు ఫిజియోథెరపీ సేవలందిస్తామన్నారు. ఫిజియో థెరపిస్టు డాక్టర్ శ్రీకాంత్ సేవలందించినట్టు తెలిపారు.